క్లుప్తంగా

కొల్లి శారదా మార్కెట్‌లో షాపుల స్వాధీనానికి ఆదేశాలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో 2023 మే 31 నాటికి 25 సంవత్సరాలు లీజు పూర్తి చేసుకోనున్న షాపులను స్వాధీనం చేసుకోవాలని అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బస్టాండ్ ఎదురుగా 1999లో మార్కెట్ నిర్మాణమైంది. ఆ సమయంలో 75 మందికి నగరపాలక సంస్థ అధికారులు షాపులు కేటాయించారు. ప్రస్తుతం లీజు గడువు ముగుస్తున్న నేపథ్యంలో వాటిని స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

చలపతి కళాశాలలో 6న హాక్ ఫెస్ట్

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్-6న జాతీయ స్థాయి పీఎస్‌జీ ఐటెక్ హాక్ ఫెస్ట్- 2024 నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. పీఎస్‌జీ టెక్నాలజీ, శాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న హాక్ ఫెస్ట్ బ్రోచర్‌ను చైర్మన్ వైవీ ఆంజనేయులు శనివారం ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఫెస్ట్‌కు తమ కళాశాల ప్రాంగణం ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. పోటీల్లో పాల్గొనే టీమ్‌లు 4–5 మందితో ఉండాలన్నారు. బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ చదువుతున్న ఏ బ్రాంచి విద్యార్థి అయినా ఈ పోటీలకు అర్హులని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.2.50 లక్షలు, ద్వితీయం రూ.1.50 లక్షలు, తృతీయం రూ. లక్షగా బహుమతులు ప్రకటించినట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌లు ప్రొఫెసర్ ఎస్.శాంతి ప్రియ, డాక్టర్ బాల మురళీకృష్ణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జె.జయకృష్ణ, ఉపాధి కల్పనాధికారి ఎ.ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఎస్‌ఈగా శ్యామ్‌సుందర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఎం.శ్యామ్‌సుందర్‌ను నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొద్దినెలలుగా ఎస్‌ఈగా పనిచేసిన పి.వి.కె.భాస్కర్ బదిలీ కావడంతో, నగరపాలక సంస్థలో ఈఈ గా పనిచేస్తున్న శ్యామ్ సుందరరామిరెడ్డి ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ప్రస్తుత ఎస్‌ఈ పోస్టును పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా పనిచేస్తున్న ఎం.శ్యామ్‌సుందర్‌కు పదోన్నతి కల్పిస్తూ గుంటూరు నగరపాలక సంస్థ ఎస్‌ఈగా బదిలీ చేశారు.

సంగీత సన్మండలి వార్షికోత్సవం ప్రారంభం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎం. వై. శేషురాణి ఆధ్వర్యంలో సంస్థ 27వ వార్షికోత్సవం శనివారం ప్రారంభమైంది. సంగీత సుధానిధి వీరఘంట లలిత, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సూర్యకాంతం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా వీరఘంట చంద్రశేఖర్, సన్మండలి గౌరవాధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్వాన్ పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణను గౌరవ పురస్కారంతో సత్కరించారు. అనంతరం చెన్నైకు చెందిన విదుషి నైవేలీ శ్రీరంజని సంతాన గోపాలం శాస్త్రీయ సంగీత కచేరి శావ్యంగా సాగింది. కార్యక్రమాన్ని ఉపాధ్యక్షురాలు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితాదేవి, కార్యదర్శి మంగా దేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, డాక్టర్ సుమిత్ర పర్యవేక్షించారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



గుంటూరు ఎడ్యుకేషన్: కంటి సమస్యల్ని నిర్లక్ష్యం చేయరాదని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు సూచించారు. సంగడిగుంటలోని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, పెదకాకానిలోని శంకర నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన రామకృష్ణప్రభు మాట్లాడుతూ కంటి సమస్యల్ని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ పేదల కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకువచ్చిన శంకర్ నేత్రాలయ వైద్యులను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు నేతృత్వంలో శిబిరానికి వచ్చిన 272 మందికి వైద్యుల బృందం పరీక్షలు చేసింది. 37 మందికి అత్యవసరంగా శుక్లాల ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు.

రెడ్డి బాలికల హాస్టల్‌లో అదనపు గదులకు భూమిపూజ

గుంటూరు ఎడ్యుకేషన్: స్తంభాలగరువులోని ఉడుముల సాంబిరెడ్డి-కోటిరత్నం బాలికల వసతి గృహంలో బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఉడుముల కోటిరత్నం, ఇతర దాతల సహకారంతో 100 మంది విద్యార్థినులకు అదనపు గదులు, బండి సాహితీరెడ్డి రీడింగ్ హాలు నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, టి.కల్పలతారెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పాల్గొని భూమిపూజ చేశారు. కార్యక్రమంలో భాగంగా బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పెదకాకాని మండలం వెనిగండ్లలోని జెడ్పీ హైస్కూల్లో బండి సాహితీ రెడ్డి కళావేదిక నిర్మాణానికి రూ.ఏడు లక్షలతో పాటు లేమల్లెపాడు ఎంపీపీ పాఠశాల మరమ్మతుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పొట్టిచైతన్యకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25వేలు, విద్యార్థిని డాలీకి విద్యాభ్యాసం కోసం రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో దాతలు బండి అశోక్‌రెడ్డి, సుధావాణి దంపతులతో పాటు 36వ డివిజన్ కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, వసతి గృహ వ్యవస్థాపకురాలు ఉడుముల కోటిరత్నం, చల్లా అంజిరెడ్డి, వణుకూరి సూరారెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, వెనిగండ్ల గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఏ.ధర్మారెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



భూమిపూజలో మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు ఏసురత్నం, కల్పలతారెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, అశోక్‌రెడ్డి, లక్ష్మీ శ్రీనివాసరెడ్డి

సంస్కృతిని గౌరవిస్తూ కొత్తదనాన్ని స్వాగతించాలి

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ కొత్తదనాన్ని స్వాగతించాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ 39వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గురువుల మార్గదర్శనంలో క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగుతూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు కో–కరిక్యులర్ యాక్టివిటీస్‌లో సైతం ముందుండాలని అన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చి, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం ద్వారా ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై. రథినీచౌదరి మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలతో పాటు విద్యార్థుల ప్రగతిని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో అద్దంకి మౌనిక, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య, ఏవో కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవంలో అద్దంకి శ్రీధర్‌బాబు, మౌనిక, రథినీచౌదరి, శ్రీనివాస్, కృష్ణప్రసాద్

వినియోగదారుల హక్కులపై చైతన్యం తేవాలి



లక్ష్మీపురం: వినియోగదారుల హక్కులపై ప్రజల్లో చైతన్యం తేవాలని డాక్టర్ ఎ.రవీంద్ర కుమార్ చెప్పారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ వినియోగదార్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు అవగాహన కల్పించడానికి ఏటా మార్చిలో ప్రపంచ వినియోగదార్ల హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సంతృప్తి చెందితేనే వ్యాపారాలు వర్ధిల్లుతాయని తెలిపారు. అన్యాయానికి, వస్తు సేవల లోపానికి గురైనప్పుడు న్యాయం కోసం వినియోగదారుల కోర్టులు, ఫోరమ్‌లను ఆశ్రయించి పరిహారం పొందడంతో పాటు అక్రమ వ్యాపారులకు శిక్షలు కూడా పడేలా చట్టాలున్నాయని తెలిపారు. ఫోరమ్‌లను నూటికి ఒక్కరు కూడా వినియోగించుకోవడం లేదని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, వినియోగదార్ల సంఘం నాయకులు కె.సాంబయ్య, సంస్థ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

నెహ్రూనగర్: 55వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో మూడు వంతెనల కింద డొంక రోడ్డులో శనివారం ఉదయం రూ.17.90లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు మీరావలి, ఆదాం, రాంబాబు, పిచ్చియ్య, భాను ప్రకాష్, జేమ్స్, రమేష్ పాల్గొన్నారు.

కారులో హ్యాండ్ బ్యాగ్ చోరీ

నగరంపాలెం: కారు పార్కింగ్ చేస్తానని అందులోని హ్యాండ్ బ్యాగ్ అపహరించడంపై పట్టాభిపురం పీఎస్‌లో కేసు నమోదైంది. గుంటూరు మెడికల్ కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదివే ఓ వైద్య విద్యార్థిని ఈనెల 2న బృందావన్ గార్డెన్స్‌లోని సిద్ధార్థ గార్డెన్స్ కల్యాణ మండపంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరైంది. ఆమె భోజనం చేసే సమయంలో ఓ వ్యక్తి వచ్చి కారు సెల్లార్‌లో నిలుపుదల చేస్తానంటూ తాళాలు తీసుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తాళాలను ఆమెకిచ్చి అక్కడ నుంచి నెమ్మదిగా జారుకున్నాడు. అనంతరం కారు తలుపులను ఆమె తీయగా హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. అందులో ఒక బంగారు గొలుసు, ఏటీఎం, ఆధార్ కార్డులతో ఉన్న చేతి సంచి అపహరణకు గురైనట్లు శనివారం ఇచ్చిన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌చంద్ర తెలిపారు.

సకాలంలో ల్యాబ్ రిపోర్టులు అందించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: సకాలంలో ల్యాబ్ రిపోర్టులు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్లతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ల్యాబ్ పరీక్షలను క్రమంగా పెంచాలని, అన్ని రకాల పరీక్షలు చేసి సకాలంలో నివేదికలు అందించాలని చెప్పారు. కీటక జనిత వ్యాధుల నివారణ విషయంలో మలేరియా ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. దోమకాటు బారిన పడకుండా తరచూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. దోమల నివారణ చర్యల్ని క్రమం తప్పకుండా చేపట్టాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ కేసుల్ని గణనీయంగా తగ్గించాలన్నారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్తలకు రిజిష్టర్లు అందజేసి వాటిని సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణన్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, పున్నారెడ్డి, ఘంటసాల శ్రీనివాసరావు, ఉమాకాంత్, ప్రశాంత్, దస్తగిరి, గణేష్ పాల్గొన్నారు.



ల్యాబ్ టెక్నీషియన్‌లకు రిజిస్టర్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్, ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల సంయుక్తంగా టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులకు పాలిసెట్, ఏపీఆర్‌జేసీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు పేర్కొన్నారు. విద్యానగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యానగర్, కొత్తపేటలోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల క్యాంపస్‌లలో ఈనెల 30 నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల్ని నిర్వహిస్తామని తెలిపారు. నిపుణులైన అధ్యాపకులతో మాథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల బోధనతో పాటు ప్రతి రోజూ 90 ప్రశ్నలతో పరీక్ష, శిక్షణ కాలం పూర్తయ్యే లోపు మోడల్ గ్రాండ్ టెస్టుల్ని నిర్వహిస్తామని వివరించారు. మొదటి పేర్లు నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్‌ను నూకవరపు మనీషా చారిటబుల్ ట్రస్ట్ అందిస్తుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 83092 82408, 98666 46712, 99590 85200 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని తిలక్‌బాబు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నల్లూరు సాంబశివరావు, కళాశాల ప్రతినిధులు బండారు సీతారామయ్య, ప్రిన్సిపాల్ రవికుమార్, ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ ప్రిన్సిపాల్స్ నవీన్, బాలకృష్ణ పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న తిలక్‌బాబు, సాంబశివరావు తదితరులు

'కాపు'కాస్తున్న సీఎం జగనన్న

ఎమ్మెల్యే, పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిలారి రోశయ్య

పట్నంబజారు: కాపుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిలారి రోశయ్య చెప్పారు. తూర్పు నియోజకవర్గం 8వ డివిజన్‌లోని పాత గుంటూరు పార్కు సెంటర్ వద్ద శనివారం కాపు కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే రోశయ్య, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ కాపుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో కాపులంతా ఏకతాటిపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి బుద్ధి చెప్పి తిరిగి జగనన్నను సీఎం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ సీఎం జగన్ పరిపాలన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కాపు సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి, సంక్షేమం వారికి అందేలా చర్యలు చేపట్టారని తెలిపారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కాపులకు ఇచ్చిన అన్ని హామీల్ని విస్మరించారని, వారికి తీరని అన్యాయం చేశారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఎస్.ఎం.జియావుద్దీన్, నరసరావుపేట అసెంబ్లీ పరిశీలకులు గులాం రసూల్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, అబ్దుల్ కర్నుమా, కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మి, యర్రి సాయి పాల్గొన్నారు.



కాపు కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రోశయ్య, ముస్తఫా

ఆహ్లాదకర వాతావరణానికి పార్కుల అభివృద్ధి

గుంటూరు నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం పెంపునకు పార్కుల అభివృద్ధి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని రెండో డివిజన్ మణిపురం బ్రిడ్జి కింద నగరపాలక సంస్థ పార్కును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పార్కులను ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా నియోజకవర్గంలోని మణిపురం బ్రిడ్జి, ఇజ్రాయిల్‌పేట చర్చి ప్రాంతంలో రూ. 24 లక్షల వ్యయంతో పార్కును ప్రారంభించినట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట వస్తువులు, గ్రీనరీతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మర్రి సత్యం, సచివాలయం కన్వీనర్ ఆనందనాయుడు, గూడూరి ఆదాంబాబు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అబ్దుల్ కలాం

పట్నంబజారు: భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం అని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిలారి రోశయ్య పేర్కొన్నారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎదుట శనివారం అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆయనతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఘన కీర్తిని సంపాదించిన మహోన్నతుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ నేటి తరానికి అబ్దుల్ కలాం ఓ గొప్ప మార్గదర్శకుడని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జియావుద్దీన్, అంజుమన్ అధ్యక్షుడు అబ్దుల్ కర్నుమా, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, నరసరావుపేట అసెంబ్లీ పరిశీలకులు గులాం రసూల్, వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



బాల్యాన్ని విష తుల్యం చేస్తున్న సామాజిక మాధ్యమాలు

ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక మాధ్యమాలకు అలవాటు పడుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి అన్నారు. లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాలలో "సామాజిక మాధ్యమాల వ్యసన నియంత్రణ-విద్యార్థుల క్షేమం కోసం కౌన్సెలింగ్ పద్ధతులు" పై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా బాల్యాన్ని విషతుల్యం చేస్తోందని తెలిపారు. సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్న కారణంగా విద్యాప్రగతి కుంటుపడటంతో పాటు ఏకాగ్రత లోపం ఉత్పన్నమయ్యే ప్రమాదముందని చెప్పారు. స్మార్ట్‌ఫోన్లను పిల్లలకు దూరంగా ఉంచాల్సిన విషయాలపై అవగాహన పెంచుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ఎస్తేరు సునీల మాట్లాడుతూ విద్యార్థుల్లో అధిక శాతం స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారడం వల్ల వారిలో విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయని తెలిపారు. భావి పౌరుల ఉజ్వల భవిష్యత్తును ఆశించి, వర్క్‌షాప్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన క్లినికల్ సైకాలజిస్టులు డాక్టర్ పి. అంజన్‌కుమార్, డి. శ్రీనివాస్ స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలైన పిల్లల ప్రవర్తనలో లోపాలను గుర్తించడంతో పాటు సరైన మార్గంలోకి తెచ్చేందుకు తీసుకోవాల్సిన పద్ధతులను పలు కేస్ స్టడీస్ ద్వారా వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పాల్ రత్నాకర్ మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ ప్రభావంతో పిల్లల్లో నేర ప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. సోషల్ మీడియా పరిణామాలు విద్యార్థులను డెత్‌గేమ్స్ వైపు, ఆత్మహత్యల దిశగా పురి గొల్పుతున్న పరిస్థితులను స్పందన ఈదా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఈదా శామ్యూల్‌రెడ్డి, డైరెక్టర్ అంజిరెడ్డి వివరించారు. కళాశాల మనోవిజ్ఞానశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఇన్నారెడ్డి పోర్నోగ్రఫీ చట్టం గురించి వివరించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు వర్క్‌షాప్‌లో పాల్గొన్న 250 మంది ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుంటూరు మెడికల్ కళాశాల సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎస్. ఉమాజ్యోతి, ఏపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రత్యూష సుబ్బారావు, డాక్టర్ డి. నాగచంద్రిక, మేనేజర్ డాక్టర్ ఎస్. వెస్లీ అబ్రహం, అధ్యాపకులు ఎం. వినయ్, వి. శేఖర్‌బాబు, జె. కిశోర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్తేరు సునీల, పాల్ రత్నాకర్

పొట్టి శ్రీరాములు జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

పట్నంబజారు: ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని శనివారం హిందూ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నేటి యువత పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకుని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణే ధ్యేయంగా ప్రాణాల్ని సైతం లెక్క చేయకుండా దీక్ష చేపట్టిన మహనీయుడని కీర్తించారు. కార్యక్రమంలో కొత్తపేట శివాలయం చైర్మన్ మొగలి సతీష్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని స్మరించుకోవాలని జిల్లా ఏఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), హనుమంతు (ఏఆర్), ఎం.వెంకటేశ్వరరావు (సెబ్) సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీలు మాట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు అమరణ నిరాహార దీక్ష చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, బ్రహ్మనందం, స్వర్ణలత, డీపీఓ ఏఓ వెంకటేశ్వరరావు, మినిస్టీరియల్ సిబ్బంది నివాళులర్పించారు.

త్యాగ పురుషుడు పొట్టి శ్రీరాములు

లక్ష్మీపురం: తెలుగు వారందరికీ స్వరాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణాలు త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు గొప్ప త్యాగపురుషుడని, సత్యాన్వేషి అని విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగరయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష సాగించి చివరకు ప్రాణ త్యాగం చేసి అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన మరణ వార్తతో ఆంధ్ర ప్రాంతం అంతా అలజడులు సాగడంతో పార్లమెంటులో భారత ప్రధాని నెహ్రూ రాష్ట్ర ఏర్పాటుకు తీర్మానం చేసి ఆమోదించారన్నారు. న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగంతో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆంధ్రులకే కాకుండా తమిళ, కన్నడ, మరాఠీ, గుజరాత్‌లకు కూడా ప్రత్యేక భాషా రాష్ట్రాలు ఏర్పడ్డాయని తెలిపారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నూరిఫాతిమా



నివాళులర్పిస్తున్న జిల్లా ఏఎస్పీలు